# నాకీ మొగుడొద్దు!

సౌమ్య చిటపటలాడే సీమ టపాసులా చిరాకుగా వుంది. డాడీకి కాఫీ ఇస్తూ 'డాడీ!... నా మొగుడు వట్టి అడ్డగాడిద. అతనితో కాపురం చేయలేను...' ఫిర్యాదు చేసింది.

'మొగుడ్ని అడ్డగాడిద నిలువు గాడిద అనకూడదమ్మా! భర్తంటే ఎవరనుకున్నావ్? సాక్షాత్తు శ్రీమహావిష్ణువు. నువ్వు సగటు భారతీయ మహిళవు. అలాంటి మాటలు వినేందుకు శ్రావ్యంగ వుండవ్...' మెత్తగా మందలించాడు భోగేశ్వరరావు.

'అహఁ! అట్లాగేం? మరప్పుడు పెళ్లాం శ్రీ మహాలక్ష్మి కాదా?-'

'ఎందుక్కాదూ? భేషుగ్గా అవుతుంది. నో డౌట్...'

'కదా!... మరి తాళికట్టిన భార్యతో వనిమనిషిలాగ చాకిరీ చేయించుకోవటం... అనాగరికంగ పిలవటం.... దౌర్జన్యం చేయటం... ఈవెధవ్వేషాలన్నీ మొగుడనే వాడు వేయటం దేనికీ అని?-' బల్ల గుద్ది మరీ వాదించింది.

'కామెంటొద్దు తల్లీ!... అసలేం జరిగిందో నాకు టూకీగ చెప్పు!- పాయింట్‌కురా....'

'నాకీ మొగుడొద్దు...'

'వాట్... వాట్... వాట్' షాక్ తిన్నాడు భోగేశ్వరరావు. కూతురేమిటీ రివల్యూషన్ ధోరణిలో మాట్లాడుతోంది? దీని మానసిక స్థితి బాగానే వుంది కదా? పి.జి. చేసిన కూతురు ఇలాగ మాట్లాడటం వింతగ విడ్డూరంగ అన్పిచింది.

'మొగుడు ఎందుకు వద్దో వివరంగ చెప్పు సౌమ్య?-'

'అతనొక కల్చర్‌లెస్ బ్రూట్! భార్యను అభిమానించటం... గౌరవించటం... ప్రేమించటం తెలీనివాడు. ధట్సాల్!

తండ్రి ఆ మాటలు విని పగలబడి నవ్వాడు.

'నువ్వా నవ్వి నన్ను కించపరిచి నాఫీలింగ్స్‌ను హర్ట్ చేయద్దు డాడీ...' నవ్వు కోపం మిళితమైనయ్' సౌమ్య మాటల్లో.

'ఇంత చిన్న విషయానికి అంత పెద్ద నిర్ణయమా? దిసీజ్ టూసిల్లీ. చూడు సౌమ్యా... భర్త అనేవాడికి కొన్ని హక్కులుంటయ్. ఈ విషయం తెల్సుకోలేక ఈ జనరేషన్ నీవంటి వాళ్లు.. తొందరపడి నిర్ణయాలు తీసుకుని పండంటి కాపురాలను ఈగో మూలంగా విచ్ఛిన్నం చేసుకుంటున్నారు. నేటి యువతుల్లో కోపం... అలక... అసహనం పెరిగిపోతున్నయ్! అన్యోన్యంగా సంసారాన్ని చక్కదిద్దుకుందామనే ఆలోచనే లేకుండా పోతోంది. అందుకే ఇన్ని అనర్థాలు!... అండ్రస్టాండ్!-'

'స్టాండు లేదు సిట్టు లేదు. ఇద్దరూ ఈక్వల్ పార్ట్నర్సే! నో సుప్రిమసీస్!...'

'నో మోర్ అర్గ్యుమెంట్ సౌమ్యా!.. ఇంతకూ ఏమంటావ్?.. ఫైనల్‌గా నువ్వేమనుకుంటున్నావో అది చెప్పు. నీకు ప్రతిది విడమరిచి చెప్పనవసరం లేదు. యువార్ వెల్ ఎడ్యుకేటెడ్...'

'కన్యాదానం చేసి చేతులు కడిగేసుకున్నారు. కాబట్టి మామల దృష్టిలో అల్లుళ్ల ఎప్పుడూ మంచి వాళ్లే మీరూ మగాళ్లే కాబట్టి కన్నకూతురినైనా లేడీస్‌ని సపోర్ట్ చెయ్యరు.

'ఏ ఆటలోనైనా సరే రెండు టీమ్‌లుంటయ్ లేకుంటే 'గేమ్' అనేదే వుండదు. లైఫూ అంతే! అందుకే మన వాళ్లు భార్య భర్త బండికి రెండు చక్రాల్లాంటి వారన్నారు. ఏ చక్రం లేకపోయినా బండి నడవదు. బోర్లాపడుతుంది. అవునా? కాదా?-'

'నీవు చెప్పేదంతా 'ట్రాష్' డాడీ...'

'ట్రాషో... బాషో!- ఇది వాస్తవం! ఇదియదార్థం! ఇంత వివరంగ చెప్పినా అర్థం చేసుకోవటానికి ప్రయత్నించటం లేదూ అటే... అది నీ బ్యాడ్‌లక్! యామైరైట్?-

'మీరిలా క్లాసు పీకటం నాకేం కొత్త కాదు డాడీ! నా మెంటల్ టార్చర్ మీకు అర్థం కావటం లేదు. నా మీద పెత్తనం ఎవరు చలాయించినా ఇష్టపడను. భర్త అయినా సరే! బిహేవియర్లో హద్దులుంటయ్. క్రాసింగ్ లిమిట్స్ నాకు నచ్చదు. ఓర్చుకోలేను.'

'నచ్చదు.. ఇష్టం లేదు అనటంలో భావం నాకు బోధపడింది!- నువ్వు చదువుకున్న దానివి కనుక యువాంట్ ఫ్రీడమ్! ఉద్యోగం చేసుకోగలననే ధీమా!- నీ బ్రతుకు నువ్ బ్రతగ్గలవనే ధైర్యం! యామైరైట్!- నో! నేన్నీ ఆలోచనా విధానాన్ని

ధోరణితో ఏకీభవించలేను. సర్దుకుపోయేదే సంసారం! అది లోపిస్తే వికారం!

'డాడీ! నీతో మాట్లాడటం నాది బుద్ది తక్కువ! నా నిర్ణయమేదో నేను తీసుకుంటాను....' తన బెడ్ రూమ్‌లోకి వెళ్లిపోయింది సౌమ్య గొణుక్కుంటు విసుగు ప్రదర్శిస్తూ!.

× × × × ×

'చూడు పెళ్లామా... నీ ఇష్టం వచ్చినప్పుడల్లా ఇంట్లో ఎవ్వరికీ చెప్పకుండా మీ పుట్టిల్లు లోకలేక దాని వెళ్లి రావటం ఇంట్లో ఎవరికీ నచ్చటం లేదు. నువ్వేమైనా లోకల్ ట్రైన్‌వా? నీచిత్తం వచ్చినట్టు రాకపోకలకు ఇకపై బంద్...' రమేష్ సీరియస్ వార్నింగిచ్చాడు.

'ఎందుకని...?-' నిర్లక్ష్య ధోరణి ద్యోతకమైంది సౌమ్య ఎదురుప్రశ్నలో

'గీరగ మాట్లాడకు!... నాకు కిర్రెక్కుతుంది! ప్రశ్నించే హక్కు నీకులేదు. నువ్వు సర్వ స్వతంత్రురాలననుకుంటున్నావేమో! యు ఆర్ మిస్టేకెన్! నువ్వు నా భార్యవు. నాకు తెలీకుండా చెప్పకుండా ఏ పనీ చేయరాదు. తర్వాత కండిషన్స్ కూడా చెవులు రిక్కించి మరీ విను!...'

'వినకపోతే..' రెటమతంగ అంది

'షటప్! అధిక ప్రసంగం వద్దు. నన్ను రెచ్చగొట్టకు! చెప్పిన మాట వినకపోతే తిక్క కుదురుతుంది'

'ఎవరి తిక్క?'

'నీ అతి తెలివి మాటలు ఆపు నేను కేవలం డిగ్రీగాడిని.. నువ్వు పి.జీ అని మీసం మెలేస్తే (సారీ! నీకు లేదనుకో) మాటేషే!-'

'ఏం చేస్తావ్?-'

'ఏక వచనం వద్దు! గౌరవంగ మాట్లాడకపోతే పంబరేగుతుంది. కౌంటర్ వేస్తుంటే... ఎన్‌కౌంటరై పోతావ్! నన్ను రౌడీ వెధవను చెయ్యొద్దు. మేటర్ సీరియస్అయితే తెలుగు సినిమాలో చిరంజీవి హిరోలా 'రఫ్' ఆడించేయగలను. చేతులు కాలేక ఆకులు పట్టుకుని ప్రయోజనం శూన్యం! ఇంకోమాట! హక్కులు.. మహిళా సంఘాలు... పోరాటాలు నీ వ్యక్తి గౌరవాన్ని కాపాడలేవ్!...'

'చెప్పాల్సిందేమైనా ఇంకా వుందా?-'

'బ్రీఫ్‌గా ఇంతే! నే చెప్పింది రాజకీయ నాయకుడి ఉపన్యాసంలా వుందనుకుంటే నీ బ్యాడ్‌లక్! తెలుగు సినిమాలో హీరోయిన్ లాగ బరి తెగించి బిహేవ్ చేయకు! పవిత్ర భారతావనిలో నువ్వు ఒకే ఒక్క దానివి కాదని తెల్సుకో! నీలాగ ఎందరో? సర్దుకుపోయే వాళ్ల సంసారం సుఖమయం చేసుకునే వరి సంఖ్య ఎక్కువ!.. నీలా రెటు మతం... వితండవాదం వున్నవాళ్లు సుఖపడలేదు. విడిపోవాలనుకుంటే న్యాయస్థానాలు న్యాయవాదులతో పన్లేదు. పరస్పర అంగీకారంతో ఒక నిర్ణయానికొచ్చి రాతకోతలు పూర్తి చేసుకుని ఎవరికి వారు విడివిడిగా వుండిపోవచ్చు! చూడూ! సంసారమనే సామ్రాజ్యానికి భర్తే డిక్టేటర్. పవిత్ర భారతావనిలో మహిళలు సర్వ సతంత్రులు కారు. పురాణ కాలం నుండి మేల్ డామినేషనే వర్ధిల్లుతోంది. సంసారంలో నిర్ణయాధికారాలన్నీ సెంట్రలైజ్డ్ అని తెలుసుకుని మసలుకో! కాదు కూడదు పవిత్ర బంధాన్ని తెంచుకోవాలనకుంటే నీ ఇష్టం! నీ తాళి తెంచను. తాళి తీసి నాకిమ్మని అడగను విడిపోయాక తాళి నీ మెడలో వుంటే నువ్వే హేళనకు గురవుతావు. భర్తను వదిలేసిన భార్యగ నీకు ముద్ర పడుతుంది. అప్పుడు ఆడదాని జీవితం కుక్కలు చింపిన విస్తరేనని తెల్సుకో! సుఖమయ సంసారాలను దృష్టిలో పెట్టుకునే 'మ్యారేజెస్ ఆర్ మేడిన్ హెవెన్' అనే ప్రావెర్బ్ ఆవిర్భవించింది! అన్యోన్నత లేని సంసరాలు 'హెల్'!...

భర్త సుదీర్ఘోపన్యాసం విన్న సౌమ్య పెద్ద నిట్టూర్పు విడిచింది!.

తెల్లవారింది! రమేష్ బద్ధకంగా నిద్రలేచాడు. అతని కాళ్ల మీద తాళిబొట్టు కన్పించింది. దాన్ని చేతిలోకి తీసుకుని ఇది సౌమ్యదే.. ఎంత దారుణానికి వొడిగట్టింది. తన నిర్ణయానుసారమే కనీసం తనతో మాట మాత్రమైనా చెప్పకుండా తనను ఇంటిని బంధాన్ని విడిచి వెళ్లి పోయిందన్న మాట.

అవున్లే! పి.జి.చేసిన నేటి మహిళ కదా? భర్త చెప్పు చేతల్లో వుంటూ సజావుగా కాపురం చేయటానికి మనస్కరించక... ఇష్టం లేక తన నిర్ణయం తాను తీసుకుని వెళ్లిపోయివుంటుంది.

సౌమ్య వెళ్లిపోయినందుకు తానేమీ బాధ పడలేదు. కళ్ల నీళ్లు పెట్టుకోలేదు. అయ్యో పాపం ఆడది వంటరిగా వీధిన పడిందనేసి జాలిపడ్డాడు.

'ఏరా... నీ పెళ్లాం ఇంకా నిద్రలేవలేదా?-' సెటైర్ వేసిన తల్లి ముఖంలోకి

నిర్వేదంగ చూశాడు ఏదో పోగొట్టుకున్నవాడిలా!

'బెడ్ కాఫీ తెమ్మంటుందేమో అడుగు! చదువుకున్న నేటి తరం మహిళామణి కదా?...' వెటకారం ధ్వనించింది తల్లి మాటల్లో.

'అది ఇంట్లో వుంటేగా నిద్రలేవటానికి?... కాఫీ తాగటానికి?...'

'అంటే.... కోడికూయకముందే పుట్టింటికెళ్లి పోయిందా?- అది వెడుతుంటే నువ్వొచవట సన్నాసిలా గుడ్లు మిటకరించి చూస్తూ వుండిపోయావ్రా?-'

'నాకు తెలీకుండానే వెళ్లిపోయింది..'

'మొగుడువి, నువ్వన్నా లక్ష్యం లేదన్నమాట అప్లిలకు మాకెట్లాగూ మర్యాదలేదనుకో....'

'అది వెళ్లి పోతుందని నాకు తెలుసమ్మా...'

'ఎలా ఊహించావ్?-'

'మనతో అది ఇమడలేకపోతున్నది. దాని భావవ్యక్తీకరణకు... స్వేచ్ఛకు మనమంతా అడ్డుగా వున్నామనే నిజాన్ని నేనెప్పుడో గ్రహించాను. మొన్న... ఇద్దరి మధ్య గొడవ జరిగినప్పుడు కోపంతో దానిమీదికి చెయ్యెత్తి చెంపపగలకొట్టబోతున్న నన్ను చూసి కళ్లు పెద్దవి చేసి తనూ చేఎత్తింది!. ఇంకేముంది...? కథ అక్కడితో ముగిసింది. కోపాన్ని దిగమింగుకుని నోటికొచ్చినట్టల్లా తూలనాడాను. అదికోపంతో రెచ్చిపోయి నావంటి సంస్కారహీనుడితో కాపురం చేయలేనన్నది. దాని పర్యవసానమే అది వెళ్లిపోవటానికి కారణమైంది. దాని తాళి కూడా తీసి నాపరం చేసి మరీ వెళ్లింది'

'అంటే... కోడలు మళ్లీ ఎన్నటికీ మనింటికి తిరిగిరాదా?-' వైదేహమ్మ కంఠం జీరవోయింది.

ఎంత అప్రదిష్ఠ?... ఎంత అప్రదిష్ఠ!... ఇంత జరుగుతున్నా నువ్వు మాతో మాట మాత్రమైనా చెప్పలేదేమిరా?... పెద్దవాళ్లం మేము కలగ చేసుకుని కోడలికి నచ్చచెప్పటమో? వాళ్ల అమ్మనాన్నాలకు చెప్పటమో చేసే వాళ్లం కదా?-' తండ్రి వామనరావు చిరుకోపంతో మాట్లాడేడు.

'అది ఎవరి మాటా వినే ఘటం కాదు నాన్నా!- వరి మొండి మనిషి!- వాళ్ల డాడీ చాలా సార్లు చీవాట్లు పెట్టి తన అభిప్రాయాన్ని మార్చుకోమన్నా సౌమ్యలో ఎలాంటి మార్పు కన్పించలేదు....'

'మరయితే సౌమ్య తన పుట్టింటికి వెళ్ళలేదా? మరెక్కడికి పోయి వుంటుంది? కొంపతీసి హుస్సేన్ సాగర్‌లోనో దూకలేదు కదా? అలా జరిగితే మనం ఇరుక్కుపోతాం!. పోలీసులు మనల్ని కస్టడీలోకి తీసుకుని సవాలక్ష ప్రశ్నలేసి కోర్టులో హాజరుపరుస్తారు. మన చేతులకు సంకెళ్లు... చివరకు జైలు శిక్ష తప్పదా ఏం ఖర్మ?...' జరిగిందానికి నొచ్చుకుంటూ తనలో గల భయాన్ని వ్యక్తం చేశాడు వామనరావు.

'ఇప్పటికైనా మించిపోయింది లేదురా అబ్బీ... నువ్వు మీ మామగారికి ఫోన్ చేసి సౌమ్య అక్కడుందేమో కునుక్కుని విషయం చెప్పెయ్యటం మంచిది...' తల్లి సలహా ఇచ్చింది.

'అఁ... అఁ! ముందునువ్వా పని చెయ్యరా...' అన్నాడు వామనరావు.

'సౌమ్య వాళ్ల అమ్మగారింటికి రాలేదట... పైగా మామగారి స్వరంలో కంగారు లేదు. సరేలే అయితే... అంటూ ఆయనే ఫోన్ కట్ చేశాడు...' చెప్పాడు రమేష్.

'అలా మాట్లాడానికి కారణం ఏమైవుంటుందబ్బా? బహుశ... జరిగిందేమిటో వివరాలు తెల్సుకోవటానికి వియ్యాలవారు మనింటికి రావాలనుకుంటున్నారేమో?... ఓరి దేవుడా... ఎన్ని కష్టాలు పెడుతున్నావయ్యా...' ఆపసోపాలు పడింది వైదేహమ్మ.

'ఒరే... పోనీ మనమే పోలీసు రిపోర్టిస్తే?-' కొడుకు ముఖంలోకి చూస్తూ మాట్లాడిన వామనరావు మాటల్లో ఆందోళన... భయం కొట్టొచ్చినట్టు కన్పించినయ్.

'పైగా అదొకటా? ఏమనిస్తాం కంప్లైంటు? లేచిపోయిందనా? ఎంత అవమానం? ఆవిడ గారేమైనా చిన్న పిల్లా? పి.జి. చదివిన... పెళ్లి చేసుకున్న నేటి మహిళ!.. చూద్దాం.. ఈవిషయంలో మనమేమీ తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దు డాడీ...'

'అదీ నిజమేలే...' బుర్ర గోక్కున్నాడు.

'ఇది కోడలా... కొరివిదయ్యమా? అయినా దీనికిదేం పోయే కాలం మొగుడ్నివదిలి తాళి తీసేసి వీధిన పడటానికి సిగ్గన్పించలేదు కాబోలు...' బుగ్గలు నొక్కుకుంది వైదేహమ్మ.

భోజనాలు చేయకుండా మధ్యాహ్నం ఒంటిగంటదాకా ఏక్షణంలోనైనా వియ్యాలవారు వస్తారనే నిరీక్షించారు. వారు రాకపోవటానికి కారణం ఏమై వుంటుందో ముగ్గురి వూహకు అందలేదు.

× × × × ×

ఇల్లు విడిచి బయల్దేరిన సౌమ్య నేరుగా తన స్నేహితురాలి ఇంటికెళ్లింది! తన చేతిలోనా డబ్బు లేదు. కన్న వారింటికెళ్లటానికి ముఖం చెల్లలేదు. తనకున్నా క్వాలిఫికేషన్‌కు ఒకటి రెండు రోజుల్లో జాబ్ దొరుక్కపోతుందానే ధీమా ఒంటరిగా బ్రతకగలననే విశ్వాసం సౌమ్యను గుడ్డిగా ముందుకు నడిపిస్తోంది.

జాబ్ వచ్చాక వర్కింగ్ ఉమెన్ హాస్టల్లో చేరిపోవచ్చనే ఆలోచనలో వుంది.

'సౌమ్య! నీకు జాబ్ దొరికే వరకు నాతో వుండాలంటే పేరెంట్స్‌తో ప్రాబ్లమే! ప్రస్తుతానికి ఏదో విధంగా మేనేజ్ చేస్తున్నాననుకో.... వీకెండ్ దాకా వుండు పర్లేదు. తర్వాత....! ఫ్రెండ్ వరూధిని చెప్తూ ఆగింది.

ఫ్రెండ్ మాటల్లో అంతరార్థం గ్రహించిన సౌమ్యకు ఆ తర్వాత ఏం చెయ్యాలో తోచలేదు. తర్వాత ఎక్కడుకని వెళ్లటం? ఎక్కడని వుండటం? తనవద్దా డబ్బుల్లేకపాయె!

ఇక తన బ్రతుకు కేరాఫ్ ప్లాట్ ఫామేనా? తను వంటరి ఆడది. 'సేఫ్టీ కోసం మెళ్లో పుస్తెలైనా లేవాయె? అందరి దృష్టి కళ్లు తనమీదే! ఆకలి చూపులు తప్పించుకోను తన వల్ల కాకుండా వుంది. కనీసం ఫాదరైనా తన గురించి వాకబు చేయటం గానీ... తన మొబైల్‌కు ఫోన్ చేయటం గానీ లేదు. డాడీ సైలెంటైపోయాడన్న మాట! మొగుడు మహాశయుడు సరేసరి! తాను అతగాడికి అక్కర్లేదు!... నో... నో.. నో! తనే ఆ డర్టీ మొగుడు అక్కర్లేదనుకుని తాళి తీసి వాడి ముఖాన కొట్టకపోయినా... సౌమ్యంగా దాన్ని తీసి అతగాడి పరం చేసి గడప దాటింది!.

ఇప్పుడేమో ప్రాబ్లం మీద ప్రాబ్లమ్! పరిష్కార మార్గం కానీ... ఉద్యోగం వచ్చే అవకాశం గానీ కనుచూపు మేరలో కన్పించటం లేదు.

ఈ బాధ తానుపడలేదు. నేరస్థుడు నేరుగా పోలీసు స్టేషన్ కెళ్లి తనకు తానుగా లొంగిపోయినట్టు... చేసిన తప్పుకు లెంపలేసుకొని... పొరపాటైందని భర్తగాడి కాళ్లమీద సాష్టాంగపడి... లెంపలేసుకుంటే... జీవితం సుఖమయం అవచ్చుకదాన్పించింది. ఇప్పుడే ఇంత దారుణంగా వుంటే... ముందున్న జీవితమంతా అభద్రతతో ఎలా గడుస్తుందోనే భయం... దిగులు సౌమ్యను పీక్కుతింటున్నయ్.

దేవుడంతటి వాడే భక్తుడు లెంపలేసుకుంటే క్షమించగా లేనిది అఫ్ట్రాల్

మొగుడు సన్నాసి తనకు తాను వెళ్లి కాళ్ల మీద పడితే... ఐస్‌లా కరిగిపోడాన్పించింది. భర్తలనబడే మగాళ్లంతా బలహీనులే! లౌక్యం ప్రదర్శిస్తే లొంగిపోతారు. మంచి మాటలతో దువ్వితే పళ్లికిలిస్తారు.

తాను నిజానికి తొందరపడి తప్పుడు నిర్ణయం తీసుకుని గడప దాటి ఘోరతప్పిదం చేసింది.

అప్పుడు ఆవేశపు క్షణాల్లో తనకీ మొగుడొద్దు అనుకుంది! ఇప్పుడేమో నానా కష్టాలు...

తనలో తాను తర్జన భర్జన పడుతూ... పలవరిస్తూ.. 'అమ్మో నాతాళి... నాతాళి...' అంటూ నిద్రపోతున్న సౌమ్యదభీమని మంచం మీద నుంచి దొర్లి నేల మీద పడింది.

ఆదెబ్బకు కళ్లు తెరిచి చుట్టూ చూచింది మెడతడువుకుని' హమ్మయ్య నాతాళి నామెడలోనే వుంది. థ్యాంక్‌గాడ్! అయితే... ఇంత పెద్దకలగన్నానా?.. అనుకుంటూ నేల మీద నుండి లేచి తత్తరపాటుతో బాత్‌రూమ్‌లోకి దూరిన సౌమ్య! 'నాకీ మొగుడొద్ద'నుకున్నందుకు లెంపలేసుకుంది ....

(సమాప్తం)